

గ్రేడ్-5 కార్యదర్శులకు డిడిఒ అధికారాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని సచివాలయ కార్యదర్శులుగా పనిచేస్తున్న బొబ్బర్లంక, వసంతవాడ, వాడపల్లి, తాడిపూడి, పులిదిండి గ్రేడ్ -5 కార్యదర్శులకు డిడిఒ అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపిడిఒ నాతి బుజ్జి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆయిదు గ్రామ పంచాయతీల కార్యదర్శులు పరిపాలనలో వారి బాధ్యతలు, విధులు, జవాబుదారీతనం, నిధుల వినియోగం తదితర అంశాలపై వారికి తగు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు విధులు సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ నాతి బుజ్జి పేర్కొన్నారు. పంచాయతీ రికార్డుల నిర్వహణ పై పంచాయతీ విస్తరణాధికారి డి.శ్రీనివాస్ సచివాలయ కార్యదర్శులకు వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల మూలంగా మొదటి, రెండవ స్థాయి ప్రమాద హెచ్చరికలు జారీ చేయనున్న నేపథ్యంలో మంగళవారం నుంచి 72 గంటల పాటు కోనసీమ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారుల వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరద నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలు గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో వరద ఉందన్నారు. అదే విధంగా బుధవారం ఉదయానికి రెండవ వరద ప్రమాద హెచ్చరికలు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఆవాసాలు మండలాల వారీగా వరద సంభవించే రహదారులు ముంపు బారినపడే రహదారులకు అంతరాయం కలిగే అవకాశం ఉందని అదేవిధంగా గోదావరి నది దాటడానికి వినియోగించే బోట్లు వద్ద అధికారులు సూచించిన మెటలైజ్డ్ పడవలలోనే లైఫ్ జాకెట్లు వేసుకుని తప్పనిసరిగా ప్రయాణం చేయాలని సూచించారు. వరద సహాయక చర్యలకు రెవెన్యూ సిబ్బంది తమ పరిధిలోని సచివాలయ సిబ్బంది సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన ఆదేశించారు. మొత్తం సచివాలయాల సిబ్బంది ముంపు బారిన పడే ఆవాసాలపై నివేదికను మండలాల వారీగా సమర్పించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయితే గంటి పెదపూడి ఆవాసం ముంపు బారిన పడుతుందని రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి 44 ఆవాసాలు ముంపు బారిన పడతాయని తెలిపారు. ఆర్డిఓలు మీ పరిధిలోని వరద ప్రభావం పొంచి ఉన్న చోట్ల జిల్లా విద్యాశాఖ అధికారి సమన్వయంతో సంబంధిత పాఠశాలలకు బుధవారం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. అధికారిక నోటీసులు లేకుండా నిమజ్జనం జరగరాదని వీలు లేదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తదితర అధికారులు పాల్గొన్నారు. గోదావరి నదికి వరద వచ్చే అవకాశం ఉన్నందున ఏ సహాయక చర్యలకు జిల్లా యంత్రాంగాన్ని సర్వ సన్నద్ధం చేశామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు మంగళవారం స్థానిక కలెక్టరేట్లో వరద స్థితిగతులు సహాయక చర్యలకు సంబంధించి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

వణుకుతున్న లంక గ్రామాలు

మామిడికుదురు: రెండు రోజుల క్రితంతగ్గిన వరద మంగళవారం నుంచి మళ్లీ పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పాశర్లపూడి ఏటిగట్టు దిగువన మూడు లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన అప్పనపల్లి కాజ్వేను పరిశీలించారు వరద ఉధృతి ఎక్కువగా పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు అప్పనపల్లి సాసనపల్లి సమస్యలు పూర్తిగా నీట మునిగింది. **కపిలేశ్వరపురం:** గోదావరి వరద నీరు పోటెత్తడంతో కపిలేశ్వరపురం మండలంలోని గోదావరినది పరివాహక ప్రాంతాలైన లంక గ్రామాల్లో వరద ప్రవాహం పెరిగింది. **కాట్రేనికోన:** మండల పరిధిలోని గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో రానున్న 48 గంటల్లో వరద ఉధృతి పెరుగుతుండడంతో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పి.సునీల్ కుమార్ అన్నారు. పడవలపై ప్రయాణం చేయొద్దని, లంక ప్రదేశాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామన్నారు.

మిడ్డే మెనూపై సమావేశం

కలెక్టరేట్ గోదావరి భవన్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు, విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజన మెనూపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక అభిరుచులు అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలోని మెనూ ను తయారు చేయాలని, పథకం అమలుపై అభిప్రాయాలు సేకరించి నివేదిక పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిఇఒ కమల కుమారి, మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం గడియారం స్తంభం సెంటర్లో నిరసన తెలుపుతున్న సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిలిపివేయాలి

సిఐటియు, ప్రజా సంఘాల రాస్తారోకో

ప్రజాశక్తి-అమలాపురం

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం గడియారం స్తంభం వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు, కౌలు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాతూరి భాస్కరరావు మాట్లాడుతూ, రూ.9వేల కోట్ల పెట్టుబడికి రూ.58 వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డి దారిన ప్రయివేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్, ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశారన్నారు. దీనివల్ల శాఖ ఉక్కు పరిశ్రమ 75 లక్షల మెట్రిక్ టన్నుల స్టీలు ఉత్పత్తి సామర్థ్యం నుంచి 30 లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి సామర్థ్యానికి పడిపోయిందని తెలిపారు. దీంతో అనివార్యంగా నష్టాల్లోకి ప్రభుత్వం ఉక్కును నెట్టారని కేంద్రంలో మోడీ ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్ర పార్లమెంట్ సభ్యుల బలంపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరణ ప్రకటనను కూటమి నాయకులు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేయించాలని డిమాండ్ చేశారు. సొంత గనులు విశాఖ ఉక్కుకు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో, 64 ఎంపీల రాజీనామాలతో, 32 వేల ఎకరాల రైతుల భూమిని సేకరించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును వదులుకోవడానికి రాష్ట్రంలో ప్రజలు సిద్ధంగాలేరని, అవసరమైతే మరో అంతిమ పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు పార్వతి, రత్నకుమారి, దైవ కప, కనకదుర్గ, వెంకటరమణ, ఆశా నాయకులు భువనేశ్వరి, వ్యవసాయ కార్మిక నాయకులు శ్రీను, తాడి శ్రీరామమూర్తి, సిఐటియూ నాయకులు మోహనరావు, సాధనాల శ్రీనివాసరావు, బెండపూడి రాముడు, చిక్కం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ఉగ్రరూపం

లంక ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎగువన కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గోదావరికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. 24 గంటల్లోనే భద్రాచలం వద్ద 24 అడుగుల మేర వరద ఒక్కసారిగా పెరిగింది. మంగళవారం రాత్రికి 49.80 అడుగులకు నీటి మట్టం చేరింది. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. బుధవారం తెల్లవారు జామున మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి ప్రవాహం చేరుకునే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద గంటగంటకూ వరద వేగంగా పెరుగడంతో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. రెండో ప్రమాద హెచ్చరికవైపు అడుగులు వేస్తోంది. కాటన్ బ్యారేజీ వద్ద 12.80 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకి లేపి 11,27,715 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. సోమవారం రాత్రికి ఇక్కడ 7.60 అడుగులు మేర మాత్రమే ఇక్కడ నీటి మట్టం ఉంది. 24 గంటల్లోనే నాలుగు అడుగులకు పైగా వరదనీరు వచ్చి చేరింది. వరద మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరించినట్టుగానే ఫ్లాష్ ఫ్లడ్స్ రావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

కోరుమిల్లిలో ఉచిత కంటి శుక్లాల శిబిరం

ప్రజాశక- కపిలేశ్వరపురం

చిన్న కోరుమిల్లి గ్రామంలో సీతారామ కాపు కళ్యాణ మండపం లో మంగళవారం ఉచిత కంటి పొర చికిత్స శిబిరం నిర్వహించారు. బులుసు కనకదుర్గ వెంకట సత్య సుబ్రమణ్య శర్మ జ్ఞాపకార్ధం లంక విజయ, మోహన్ చంద్, బులుసు భమిడిపాటి కుటుంబ సభ్యుల నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్ ఛార్జ్ వేగుళ్ళ లీలా కష్ణ లు ప్రారంభించారు. ఈ శిబిరంలో చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల నిపుణులు వారం రోజులపాటు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంఎల్ఎ వేగుళ్ల

అలాగే ఈ నెల 14 నుంచి 18 వరకు కంటి శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, కార్యదర్శి కొండలరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోఆర్డి బైరం రాజు, తదితరులు, పాల్గొన్నారు.


పిఎంశ్రీ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో భాగంగా జిల్లాలో మంజూరైన పీఎంశ్రీ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. అమలాపురం విద్యా నిధి పాఠశాలలో మంగళవారం పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల పరిధిలోని సర్పంచులు, ఎస్ఎంసి చైర్మన్ లతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో డిసిఇబి సెక్రెటరీ బి.హనుమంతరావు, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ డి.రమేష్ బాబు, సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బివివి.సుబ్రహ్మణ్యం, ఎపిఒ డాక్టర్ ఎంఎకె.భీమారావు తదితరులు మాట్లాడారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-అంబాజీపేట



ఆర్.భీమరాజు, సిఐ

శాంతిభద్రతలకు ఎవరైనా విగాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పి.గన్నవరం సిఐగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.భీమరాజు హెచ్చరించారు. మారేడుమిల్లి సిఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పి.గన్నవరం సిఐగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో అయినవిల్లి, అల్లవరం, ఉప్పలగుప్తం, అంబాజీపేట మండలాల ఎస్ఐగా, అమలాపురం రూరల్ పట్టణ సిఐగా గతంలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం, గంజాయి, వంటివి సేవిస్తే ఉపేక్షించేది లేదన్నారు. స్కూల్స్ వదిలిన సమయంలో ఆకతాయిలు అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పమన్నారు. ప్రజలకు వినాయకచవితి సందర్భంగా నిమజ్జనాలలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎస్ఐ ఎ.చిరంజీవి, పోలీస్ సిబ్బంది, పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బంగారం తాడు పోలీసులకు అందజేత

ప్రజాశక్తి-రామచంద్రాపురం

పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం బంగారపు తాడు సెక్యూరిటీ సూపర్‌వైజ్ర పలివెల శ్రీను కి దొరికింది. వెంటనే ఆ బంగారుం తాడును ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ కి అందజేశాడు. అనంతరం ప్రవీణ్ కుమార్, పలివెల శ్రీను రామచంద్రపురం పోలీస్ స్టేషన్ కు వెళ్లి బంగారపు తాడును పోలీసులకు అందజేశారు. వారిని పలువురు అభినందించారు.

నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి-రావులపాలెం

మండల కేంద్రం నారాయణ ప్రిన్సిపల్ రమణ బాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ ఇన్వెస్టిట్యూట్ సెర్మని వేడుకల్లో ఎస్ఐ జి.చంటి, ఎజియం శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చిన్న వయసునుండే నాయకత్వం నైపుణ్యాలతో సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దేలా బాధ్యతాయుతంగా విద్యార్థులు ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఇంచార్జ్ అప్పారెడ్డి, ఎఒ వెంకట్ రెడ్డి, ఆర్ఎస్టి రాధాకృష్ణ, సోమన్న, శైలజ, దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న నారాయణ ప్రిన్సిపల్, ఎస్ఐ జి.చంటి తదితరులు

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బైపాస్ రోడ్ లోని కొండాలమ్మచింత ప్రాంతంలో ఐనవిల్లి, కొత్తపేట వెళ్ళే క్రాస్ రోడ్ లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సీనియర్ న్యాయవాది బంధ వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు జాతీయ రహదారి అధికారులకు మంగళవారం ఆన్ లైన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో మంగళవారం జాతీయ రహదారి అధికారులు స్పందించి ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లు, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు న్యాయవాది తెలిపారు.

అధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-కొత్తపేట

భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వం అధికారులు అందిస్తున్న సూచనలను పాటంచాలని కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ కోరారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలు ప్రస్తుత వర్షాలు పరిస్థితి కారణంగా అవసరం ఉంటేనే బయటికి రావాలని లేని పక్షంలో ఇళ్లకే పరిమితం కావాలన్నారు. ముఖ్యంగా తుపాను సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని దీనికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్తు స్తంభాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు ఇటీవల కాలంలో వాతావరణ పరిస్థితుల కారణంగా జ్వరాలు అధికంగా ఉన్నాయని జ్వరాలు వచ్చిన వారు తక్షణం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించి వారు సూచించిన మందులను వాడాలని బండారు శ్రీనివాస్ కోరారు.



జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం శివరాంకు ప్రింటర్ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జెడ్‌పి ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆలమూరు

హై స్కూల్ పూర్వ విద్యార్థులుగా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా అభివృద్ధికి కృషి చేస్తామని 1991-92 10వ తరగతి విద్యార్థులు పేర్కొన్నారు. చెముడు లంక ఎస్‌టిఎస్ఎన్ఎం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో పూర్వ విద్యార్థులు రూ.20 వేలతో ఒక ప్రింటర్ను కొనుగోలు చేసి పాఠశాలకు మంగళవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల మా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అందులో కొన్ని ఈ స్కూల్ అభివద్ధి కోసం తీర్మానాలు ప్రవేశపెట్టి అంగీకరించామన్నారు. ఇందులో భాగంగా మా సహచరుడు ఇటీవల హఠాత్ మరణం పొందడంతో వారి పిల్లల భవిష్యత్తు కోసం రూ.60 వేలు సమకూర్చి పోస్ట్ ఆఫీస్ నందు ఫిక్స్ డిపాజిట్లను చేసి వారికి అందజేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఆలమూరు డిసి అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటరత్నం, బివి.లంక సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, సత్తిబాబు, విద్యుత్ లైన్మెన్ గొడవర్తి సురేష్, హెచ్‌ఎం శివరాం కుమార్, నాగిరెడ్డి సత్యానందం, తిరణాతి వెంకటేశ్వరరావు, రాయుడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన ఉద్యోగులు అంబేద్కర్ విజన్ వికాస్ నాలెడ్జ్ హబ్ పేరుతో విద్యార్థులకు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపిడిఓ నాతి బుజ్జి, ఎంఇఒ వరప్రసాద్ అన్నారు. మంగళవారం వారు డిజిటల్ ప్రొజెక్టర్ మరియు రెండు కంప్యూటర్లను జిల్లా ఉన్నత పాఠశాలకు అందజేశారు. ఈ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ క్లాసులను ఎంపిడిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ఉద్యోగులంతా మంచి కార్యక్రమాలు చేస్తున్నారని అని అన్నారు. విద్యార్థులు ఈ డిజిటల్ క్లాసుల ద్వారా గురుకుల పాఠశాల మరియు నవోదయ పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించేలా విద్యార్థులను ఉపాధ్యాయులు సంసిద్ధం చేస్తారన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ప్రజాశక్తి-ఆలమూరు

గర్భిణులు, బాలింతలు నిర్దేశించిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.నాగలక్ష్మి, సర్పంచ్ లంక వరప్రసాద్ అన్నారు. మూలస్థానం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలపై సర్పంచ్ వరప్రసాద్ అధ్యక్షతన మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతోత్సవం, శిశువులకు అన్నప్రాసన నిర్వహించి, వారికి ఉత్తమ పౌష్టికాహారా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు గానుగుల చిన్న, మాజీ సర్పంచ్ ఇళ్ల శేషాద్రి శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు బావిశెట్టి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలో 11 కెవి ఫీడర్, పల్లంకూరు 11 కెవి ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్లలో ఓవర్ లోడ్ కారణంగా వర్క్ చేస్తారని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోకా రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్లు తొలగింపు పనులు చేపడతారన్నారు. ఈ కారణగా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారున. కాట్రేనికోన, వేట్లపాలెం, గచ్చకాయలపొర, సిరయానం, కొండలేశ్వరం,గెద్దనాపల్లి, కొప్పిగుంట, దొంతుకూరు, పల్లం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారన్నారు.

కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం



115 జిఒ రద్దు చేయాలని నర్సుల నిరసన

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులందరిని రెగ్యులర్ చేయాలని ముమ్మిడివరం కమ్యూనిటీ ఆసుపత్రి నర్సుల యూనియన్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇటీవల జారీ చేసి, అమలు చేస్తున్న జిఒ నంబర్.115 ను తక్షణమే ఉపసంహరించు కోవాలని ముమ్మిడివరం సామాజిక ఆసుపత్రి హెడ్ నర్సు వేదామణి డిమాండ్ చేశారు. జిఒను నిరసిస్తూ మంగళవారం నర్సులు భోజన విరామ సమయంలో నిరసన ఆందోళన తెలియజేశారు. పుష్పవతి మాట్లాడుతూ జిఒ ను ఉప సంహరించని పక్షంలో ఉద్యమానికి వెనుకాడేది లేదన్నారు. ఆందోళనలో నర్సు లు శిరీష పార్వతి లతో పాటు పలువురు నర్సులు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గున్నేపల్లి అగ్రహారంలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్



పనులు చేయిస్తున్న సర్పంచ్ రాము

గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో సర్పంచ్ పెద్దిరెడ్డి రాము ఆధ్వర్యంలో మంగళవారం పేరుకుపోయిన చెత్తను తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గోతుల్లో నీరు నిల్వ ఉండడం, చెత్త పేరుకు పోవడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా చెత్తను తొలగించారు. ప్రజలు రోగాల బారిన పడకుండా శానిటేషన్ చేయించారు. కార్యక్రమంలో వార్డ్ నెంబర్ అనుపిండి సీతారామయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'వాడపల్లి' యాత్రికులకు ఉచిత బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-ఆత్రేయపురం


వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా రెండు ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాత్రికులకు సౌకర్యార్థం ఉచిత బస్సు సౌకర్యములు ఏర్పాటు చేయుటకు ఎంఎల్ఎ బండారు సత్యానంద రావు, ఉప కమిషనర్ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఇ.విశ్వేశ్వర రావు బ్యాంకు నుంచి రెండు బస్సులను ఇచ్చేందుకు స్పందించారన్నారు. బస్సులు ఎలా నడిపేదని కార్యాచరణ రూపొందించామన్నారు.

గణపతి లడ్డూల వేలం

ప్రజాశక్తి -మామిడికుదురు

పెదపట్నం లంక దుర్గమ్మ సెంటర్లో సిద్ధి వినాయక చవితి ఉత్సవాల్లో మంగళవారం లడ్డూల వేలం నిర్వహించారు. ఏడిద వీరభద్ర మొదటి లడ్డు రూ.26 వేలకు, రెండవ లడ్డు పేకెటి రామకృష్ణ రూ.17,200కు, మొదటి ఉట్టు శిరిగినీడి గణేష్ రూ.1100కు, రెండవ ఉట్టు కుంపట్ల రామలక్ష్మణ్ రూ.1600కు, బరకం కొప్పుల దుర్గా రావు రూ.5,100కు,అరటి గెలలు ఏడిద సాయి రూ.మూడు వందలకు పాడుకున్నారని ఉత్సవ కమిటీ తెలిపింది. అనంతరం వైనతేయలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు

కార్టూ'నిజం'



జిఒ 85కు వ్యతిరేకంగా వైద్యుల ఆందోళన

నల్లబ్యాడ్జీలతో పిహెచ్‌సిల్లో విధుల నిర్వహణ

ప్రజాశక్తి-ఆలమూరు

ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సంఘం(ఎపిపిహెచిడిఎ) ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో చొప్పెల్ల, పెదపల్ల పిహెచ్‌సిల వైద్యులు జిఒ 85కి వ్యతిరేకంగా తమ ఆందోళనతో విధులు కొనసాగిస్తూనే మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సువర్చల దేవి, మల్లికార్జున రావు, భవాని శంకర్, సాయి కిషోర్ మాట్లాడుతూ ఈ జిఒను అన్యాయంగా పరిగణించి నిరసనతో విధులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ జిఒ ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందన్నారు. ఇలా అకస్మాత్తుగా జిఒను మార్చడం అన్యాయం అని, తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు. గత రెండు నెలలుగా జిఒ 85 రద్దు చేయమని అన్ని అధికారులకు, ఎంఎల్ఎలకు అర్జీలు సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆందోళన ప్రణాళికలలో భాగంగా 10 నుంచి 12 నల్ల బ్యాడ్జీలు ధరించి సేవలలో అంతరాయం లేకుండా నిరసన కొనసాగుతుందన్నారు. ఇంతలో ప్రభుత్వ చర్చలకు పిలవని పక్షంలో 13న పిహెచ్‌సి సేవలు, అత్యవసర సర్వీసులను మినహాయించి, అన్ని రిపోర్టింగ్‌లు, విసి, టిసి, అధికారిక కమ్యూనికేషన్‌లు నిలిపివేస్తామన్నారు. 14న కేవలం అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితం చేయబడతాయన్నారు. 15న 'చలో విజయవాడ' ర్యాలీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద నిర్వహిస్తారన్నారు. ఇక చివరగా ఈ నెల 16న నుంచి జిఒ 85 రద్దు వరకు నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం అవుతుందని తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తూ వైద్య సేవల్లో డాక్టర్ సువర్చాల దేవి

డిసిసి అధ్యక్షుడు కొండేటికి సత్కారం

ప్రజాశక్తి-మామిడికుదురు

అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా నియమితులైన పి.గన్నవరం మాజీ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబును నగరంలో ఆయన స్వగృహం వద్ద మంగళవారం మామిడికుదురు, అంబాజీపేట మండలాల పార్టీ శ్రేణులు కలసి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పిసిసి ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్, మాచవరపు శ్రీమన్నారాయణ, మామిడికుదురు మండల శాఖ అధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు,డి.భాస్కరరావు, మేడేపల్లి రత్నం, వి.దొరబాబు పాల్గొన్నారు.



చిట్టిబాబును సత్కరిస్తున్న కాంగ్రెస్ శేణులు

13న ముమ్మిడివరంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 13న ముమ్మిడివరం లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోక్ మాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల్లో జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు నాలుగు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. వివరాలకు రాజేంద్రప్రసాద్ సెల్ నెం.8247645389 సంప్రదించాలన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం పంచాయతీకి చెందిన పోలిశెట్టి రమేష్‌కుమార్(45) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ. పి.సత్యనారాయణ తెలిపారు. అప్పుల బాధ తాళలేక ఈనెల 7న రమేష్‌కుమార్ పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని స్థానికులు గుర్తించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే సోమవారం అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందిటన్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం

ప్రజాశక్తి - రాజోలు

వేగివారిపాలెం గ్రామంలో 9 ఏళ్ల బాలికపై 72 ఏళ్ల వృద్ధుడు అత్యాచార యత్నం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. ఈనెల 7న వేగివారిపాలెం గ్రామంలో 4వ తరగతి చదువుతున్న 9 ఏళ్ల బాలిక పిల్లలతో కలిసి ఆడుకుంటోంది. అదే గ్రామానికి చెందిన వృద్ధుడు పితాని సత్యనారాయణ ఈ పాపను చాక్లెట్ ఇస్తానని ఇంటిలోని తీసుకుని వెళ్లి తలుపులు వేసి అత్యాచారం చేయబోయాడు. ఇంతలో తోటి పిల్లలందరూ తలుపులు కొట్టగా బయటకు వచ్చి పారిపోయాడు. బాలిక ఏడుస్తూ బయటికి వచ్చింది. బాలిక తల్లి మూగ కావడంతో ఎవరికి చెప్పుకోలేక పోయింది. మంగళవారం బాలిక సోదరి గాయత్రి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో రఘుదేవపురంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.8,350 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గంగపాలెం గ్రామ శివారున అదే గ్రామానికి చెందిన వేలంశెట్టి చంద్రరావు సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎఎస్ఐ రాంబాబు నాయక్ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

2,077 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వీరవరంలో అక్రమంగా నిల్వ చేసిన 2,077 కిలోల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5.14 లక్షలు ఉంటుందని తెలిపారు. టాటా ఏస్ వాహనం, కాటాను సీజ్ చేశామన్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసిన పసలపూడి గంగరాజు, పాబోలు గణపతి, వ్యాన్ డ్రైవర్ వాసిరెడ్డి పద్దయ్యలపై కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ టి.నాగవెంకటరాజు తెలిపారు. ఈ దాడుల్లో డిటి నాగలక్ష్మి, విజిలెన్స్ కానిస్టేబుల్ శివ, విఆర్ఒ వేమగిరి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జిఒ 85పై వైద్యుల ఆగ్రహం

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 85పై వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. **చాగల్లులో** వైద్యులు ముఖేష్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యులు నిరసన తెలిపారు. ఈ జిఒ వల్ల తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోతుందన్నారు. రెండు నెలలుగా జిఒ 85ను రద్దు చేయాలని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో సమ్మెకు సిద్ధమవుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపామన్నారు. **ఉండ్రాజవరంలో** ఉండ్రాజవరం, వేలివెన్ను పిహెచ్‌సిలో వైద్యులు ఆర్.ఉషాదేవి, ఇర్ఫాన్, సృజనలు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డాక్టర్లకు తీవ్ర అన్యాయం కలిగించే జిఒను తక్షణమే రద్దు చేయాలన్నారు. **నల్లజర్ల** మండలంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మంగళవారం నుంచి సమ్మె సైరన్ మోగించారు. వైద్యుల సర్వీసు కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 85కి వ్యతిరేకంగా తాము సమ్మెకు దిగినట్టు నల్లజర్ల పిహెచ్‌సి ప్రధాన వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు తెలిపారు. న్యాయం జరిగే వరకూ వైద్య సేవలకు అంతరాయం లేకుండా పోరు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దశల వారీ నిరసన కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని పిహెచ్‌సి అదనపు వైద్యాధికారి మహ్మద్ సిరాజుద్దీన్ ప్రకటించారు. వైద్యుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ వెల్లడించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్య పేట ప్రధాన రహదారిలో విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్‌ను లతలు, పిచ్చి మొక్కలు అల్లు కుపోయి ప్రమాదకరంగా మారింది. కళ్లెదుటే కన్పిస్తున్నా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవ డంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు, విద్యుత్ తీగలను లతలు అల్లుకుపోయాయి. తక్షణమే పిచ్చి మొక్కలను, లతలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న లతలు

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా ?

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- చర్యలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-ఆలమూరు

రహదారులు, భవనాల శాఖకు సంబంధించి ఆలమూరు మండల పరిధిలో సుమారు 50 కిలోమీటర్ల మేర వివిధ రహదారుల రూపంలో విస్తరించి ఉన్నాయి. ఈ మార్గాల్లో రోడ్లు ఛిద్రంగా మారి గోతుల పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రయాణీకులకు పలు చోట్ల వాహన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయితే ఆ శాఖ అధికారులు రోడ్ల మరమ్మతులు, రోడ్ల నిర్మాణాలకు ఎటు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ముఖ్యమైన రహదారులు


మండలంలో జొన్నాడ నుండి గుమ్మిలేరు వరకు 9 కి.మీ మేర, మడికి శివారు మల్లవానితోట నుంచి సందిపూడి వరకు 21 కి.మీ మేరకు ఆర్అండ్‌బి రోడ్లు ఉన్నాయి. ముఖ్యంగా ఇవి నిత్యం వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ప్రస్తుతం ఈ రోడ్లు భారీ గోతులతో ప్రయాణించడానికి వీల్లేని పరిస్థితికి చేరుకున్నాయి. ఇందులో మరీ ముఖ్యమైన 216 ఎ జాతీయ రహదారి జొన్నాడ సెంటర్ నుండి మండపేట మీదుగా కాకినాడ వెళ్లే ప్రధాన రహదారిపై మరింత రద్దీగా వాహన రాకపోకలు నిత్యం సాగుతూ ఉంటాయి. అలాంటి ఈ రహదారిపై అధికారుల పర్యవేక్షణ లేక గోతులతో బురదమయంగా తయారైంది. దీంతో ఈ రహదారిపై వెళ్లే ప్రయాణికుల వాహనాలు అదుపు తప్పి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ కోవలోనే జొన్నాడ 'ఎస్ టర్నింగ్', 'ఎల్ టర్నింగ్'ల వద్ద, మండల కేంద్రంలో ఎంపిపి పాఠశాల టర్నింగ్ వద్ద, మురళీ కష్ణ, సత్యలక్ష్మి రైస్ మిల్లుల సమీప ప్రదేశాల్లో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అలాగే నర్సిపూడి హైస్కూల్ వద్ద, పెనికేరు గ్రామ మలుపుల్లోనూ, కొత్తూరు సెంటర్ నుంచి చింతలూరు, పెదపల్ల, సందిపూడి వెళ్లే రహదారులలోను దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే చొప్పెల్ల నంది గుంట నుంచి మూలస్థానం వరకు విస్తరించిన ఐదు కి.మీ రోడ్డు దెబ్బతింది. ఇందులో పలువురు ప్రాణాలు కోల్పోగా పలువురు అంగవైకల్యంతో మంచానికే పరిమితం అయ్యారు. అయితే సంబంధిత అధికారులు రహదారుల మరమ్మతులు, రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుల పేర రూ. 2.12 కోట్ల వృధా

2019 జనవరిలో జొన్నాడ, గుమ్మిలేరు రహదారికి రూ.1.72 కోట్లతోను, జొన్నాడ ఎస్ టర్నింగ్, ఎల్ టర్నింగ్‌ల ఆధునికీకరణ రూ.40 లక్షలతోను నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ ఇంతవరకు గుత్తేదారులకు ఆనిధులు విడుదల కాకపోవడంతో వీటికి మరమ్మతులు విస్మరించారు. ఈ కారణంగానే రహదారి సమస్య మరీ దుర్భరంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, కనీసం తాత్కాలిక మరమ్మతులైన చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



జొన్నాడ టర్నింగ్ వద్ద రోడ్డు దుస్థితి, ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల అవస్థ




చింతలూరు వద్ద ఆర్ అండ్ బి రహదారి దుస్థితి

రహదారుల నిర్మాణానికి చర్యలు



రహదారులు ఛిద్రంగా మారిన మాట వాస్తవమే. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాం. ఇంతకాలం నిధులు విడుదల విషయంలో జాప్యం ఏర్పడింది. తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు కోసం ఎస్టిమేట్లు పంపించాం. అయితే టెండర్లు కోసం పిలుస్తున్నా గుత్తేదారులు పాత బకాయిలు తీర్చినదే పనులు ప్రారంభించలేమని అంటున్నారు. దీంతో గుత్తేదారుల కొరతతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

– సూర్యనారాయణ, ఆర్ అండ్ బి డిఇ



నర్సిపూడి వద్ద గోతులతో మట్టి రోడ్డుగా మారిన ఆర్ అండ్ బి రోడ్డు

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

చెక్కా సురేష్ S/o. అప్పారావు(లేటు) D.No.5-27,చర్చి ఎదురు వీధి, పాత హరిజనపేట, సర్పవరం, కాకినాడ రూరల్, కాకినాడ జిల్లా, మా ఇంటి వద్దనుండి సర్పవరం వెళ్ళే దారిలో డాక్యుమెంట్ నెంబర్ **16726/2022, 16727/2022** రెండు ఒరిజినల్ దస్తావేజు **27-08-2024** తేదీన జిరాక్స్ తీయించుటకు బైక్ మీద వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినవి. వెతికినా దొరకలేదు. కావునా దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

చెక్కా సురేష్
9030301077

నలుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ

-21 కేసుల్లో కోటికి పైగా సొత్తు స్వాధీనం

-జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడి



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన వివిధ చోరీ కేసులకు సంబంధించి నలుగురు ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేశారు. 21 ఇంటి దొంగతనాలు, నేరాలకు సంబం ధించి రూ.84 లక్షల విలువ చేసే 1200 గ్రాముల బంగారం, సుమారు రూ.10 లక్షల విలువ చేసే 11 కిలోల వెండి, ఒక మోటార్ సైకిల్‌తోపాటు సుమారు కోటికి పైబడిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడిం చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ చోరీలకు సంబంధించి కాకినాడ గైగోలపాడుకు చెందిన పాత నేరస్తులు టేకుమూడి శ్రీకాంత్, వల్లి లక్ష్మణ్‌కుమార్, వల్లి రామ్‌కుమార్, అలాగే తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు మెండి మహేశ్వర దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేశారు. వీరంతా కాకినాడతోపాటు, ఇంద్రపాలెం, తిమ్మాపురం, సామర్లకోట, పెద్దాపురంలలో పగలు ఇంటి బయట తాళాలు వేసిన ఇళ్ళను గుర్తించి, రాత్రి సమయంలో సదరు ఇళ్ళ తలుపులు, తాళాలు బద్దలు కొట్టి దొంగతనాలు చేసేవారని అన్నారు. ప్రధాన ముద్దాయిలను సోమవారం సర్పవరం గ్రామ శివారు భవన్నారాయణ స్వామి గుడి సమీపములో ఉన్నారని వచ్చిన సమాచారంతో వారిని అరెస్ట్ చేసి దొంగిలించిన సొత్తును, మోటార్ సైకిల్‌ను స్వాధీన పరుచుకున్నట్లు చెప్పారు. ముద్దాయిలను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ చోరీల్లో సొత్తును స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన అడిషనల్ ఎస్‌పి (పరిపాలన) ఎన్‌జివి.భాస్కరరావు, ఎస్‌డిపిఒ రఘువీర్‌విష్ణు, ఎస్‌బి డిఎస్‌పి సిహెచ్.శ్రీరామ కోటేశ్వరరావు, సర్పవరం సిఐ బి.పెద్దిరాజు, క్రైమ్ సిఐ వి.కృష్ణ, సర్పవరం ఎస్ఐ కె.రామకృష్ణమూర్తి, క్రైమ్ ఎస్ఐ వినయ్ ప్రతాప్, సర్పవరం ఎఎస్ఐ బలరాం, హెచ్‌సిలు సత్తిబాబు, రాజు, గణేష్, పిసిలు వెంకటరత్నం, క్రైమ్ సిబ్బంది గోవిందరావు, ధనరాజు సత్యమూర్తి, చిన్న, వర్మ, మౌళి, నాయుడు, ఐటి కోర్ పిసి స్వామిలను ఎస్‌పి అభినందించారు.

పాస్‌పోర్టు పడిపోయినది

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం వాకలగరువు గ్రామానికి చెందిన కాప వీర వెంకట సత్యనారాయణ తండ్రి నాగభూషణం పాస్‌పోర్ట్ పడిపోయినది. పాస్ పోర్ట్ నెం. **P0632604** ది.**01-09-2024**వ తేదీన వాకలగరువు నుండి నుండి అంబాజీపేట జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింద అడ్రస్ కు అందజేయగలరు.

కాప వీర వెంకట సత్యనారాయణ
తండ్రి నాగభూషణం
వాకలగరువు గ్రామం, అంబాజీపేట మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
పిన్ కోడ్: 533218 సెల్ :9866158903

12న తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట వాటర్ వర్క్స్‌లో నిర్వాహణ, ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 12వ తేదీ సాయంత్రం పూట కనకాలపేట, గణపతి నగర్, యుకెవి నగర్, భీమ్ నగర్, పెద్దిరెడ్డి గార్డెన్స్, కోన గార్డెన్స్, ఫ్రాన్స్ తిప్ప ఏరియాలలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు కాళ్ళ నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని కోరారు. నీటిని వృధా చేయరాదని సూచించారు.

ఎంఎల్ఎను కలిసిన చవితి నిర్వాహకులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను పలు గ్రామాలకు చెందిన చవితి ఉత్సవ నిర్వాహకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 29వ తేదీన పిళ్లారాయ స్వామివారి అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయనను అన్న సమారాధన కమిటీ సభ్యులు కోరారు. యానాం బైపాస్ వర్తక సంఘం సభ్యులు ఈనెల 13వ తేదీన నిర్వహించబోయే లక్ష్మీ గణపతి హోమం కు రావాలని ఆహ్వానించారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో భోజనాల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన డొక్కా సీతమ్మ క్యాంటీన్లో మంగళవారం నిరుపేదలకు ఉచితంగా భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. జనసేన నాయకులు కార్యకర్తలు భోజనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, బాలు సూరంపాలెం, సూరపరెడ్డి నరేష్, గోపి స్వామి, రేవూరి శ్రీను, పితాని వీరబాబు, రామకుర్తి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

బాధితులకు హెల్పింగ్ టీమ్ చేయూత

పజాశక్తి - తాళ్లరేవు

అగ్నిప్రమాద బాధితులకు హెల్పింగ్ టీమ్ సభ్యులు సూరంపూడి కుమార్, రెడ్డి మణికంఠ, గంజా మణికంఠ, శ్రీపాదం వల్లిపద్మ నిత్యవసర సరుకులు, బియ్యం, కూరగాయలు అందజేశారు. సహకరించిన దాతలకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రజాశక్తి-రామచంద్రపురం

స్థానిక మున్సిపల్ ఆఫీస్ వద్ద విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచిన సిఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తెలుగు మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. కష్టకాలంలో ప్రజల క్షేమం కోసం చురుకైన చర్యలు తీసుకోవడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సిఎం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, సహాయం అందజేసి, బాధితుల కోసం సత్వర చర్యలు చేపట్టడం ప్రశంసనీయమని కొనియాడారు. ప్రభుత్వం వెంటనే ఆహారం, తాగునీరు, మెడికల్ సౌకర్యాలు, తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేయడం, అవసరమైన సమయంలో నిధులు కేటాయించడం వంటి చర్యలను తీసుకోవడం వలన విజయవాడ పట్టణం తొందరగా కోలుకొని సాధారణ స్థితికి చేరుకుందన్నారు. అదేవిధంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సిఎం చంద్రబాబు పిలుపుమేరకు వరద బాధితులకు అవసరమైన సామగ్రిని లారీలో తీసుకుని వెళ్లి విజయవాడలో ఉండి స్వయంగా వరద బాధితులకు అందజేశారని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

కొత్తపేట: సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జిల్లా టిడిపి అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది చంద్రబాబును అక్రమ అరెస్టు చేస్తే వర్గాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరు ఖండించారని ఆమె గుర్తు చేశారు. అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయని దేశవ్యాప్తంగా మద్దతు పలికారని అన్నారు. వైసిపి అవినీతి, అరాచకాలకు, అక్రమ అరెస్టులకు నిరసనగా తెలుగు ప్రజలు చరిత్రలో నిలిచిపోయేలా వైసీపీని 11 సీట్లకే పరిమితం చేస్తూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు.



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ డాక్టర్ మౌనిక

80 మందికి కంటి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లిలో మంగళవారం అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ జొన్నాడ శ్రీ దుర్గ ప్రారంభించారు. శిబిరంలో ఆప్తాల్మిక్ డాక్టర్ ఎస్.మౌనిక 80 మంది కంటి రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు, నాయకులు మంచెం బాలకృష్ణ, జొన్నాడ చిన్ని, కడలి శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

విజయవాడ వరద బాధితులకు పలువురు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రజాప్రతినిధులు విజయవాడలో వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

అమలాపురం: విజయవాడ వరద బాధితుల కోసం కడలి సేవా ట్రస్ట్ , అనాతవరానికి చెందిన విశ్రాంత పోలీస్ డిపార్ట్మెంట్ ఉద్యోగి అయిన కడలి శ్యామ్ బెనెగల్ ఎన్ఆర్ఐ ముందుకు వచ్చి సిఎం సహాయ నిధికి రూ.50 వేల విరా ళాన్ని చెక్కు రూపంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ కు అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక విశ్వం వాయిస్ దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ కె.వెంకటేశ్వర రావు, గణేష్ కిరాణా కుప్పాల బ్రదర్స్ రూ.50 వేల చెక్కును సిఎం సహాయ నిధికి స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్‌కు అందించారు. **రామచంద్రపురం:** వరద బాధితులను ఆదుకోవాలని ద్రాక్షారామ పట్టణంలో మంగళవారం పి డి ఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు. వెంటపల్లి భీమశంకరం, పిడిఎస్‌యు నాయకులు నవీన్, హరీష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు. సేకరించడం విరాళాలన్నీ వరద బాధితులకు అందజేస్తామని ఈ సందర్భంగా వారు వివరించారు.

సహాయక చర్యలను పర్యవేక్షణ

మామిడికుదురు: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతమైన జక్కంపూడి కాలనీలో మంగళవారం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అధినేత ఆదేశాల మేరకు డివిజన్ అధికారులను సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షణ కార్యక్రమాలు చేస్తున్నారు. రెండవ రోజుఉదయం అధికార బందం తో సమావేశంమై తరువాత జక్కంపూడి కాలనీ బ్లాక్ నెంబర్ 174లో పర్యటించి ముంపు ప్రాంతం బాధితులతో ముఖాముకీ నిర్వహించారు. బాధితులు వారి కష్టాలు చెప్పుకుంటూ సర్వం కోల్పోయామని కనీసం చదువుకునే పిల్లల పుస్తకాలు సైతం కొట్టుకుపోయాయని చెప్పడంతో అప్పటికప్పుడే ఎంఎల్ఎ సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళ్లారు..ఓ వైపు శానిటేషన్, పూడికతీత పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్న సమయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంఎల్ఎ వసంత కష్ణ ప్రసాద్ రావడంతో మర్యాద పూర్వకంగా వాళ్లని కలిశారు. అనంతరం ఎంఎల్ఎ గిడ్డితో పాటు మనోహర్ కలిసి నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు



విజయవాడలో నిత్యావసరాలు అందజేస్తున్న పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి, మంత్రి మనోహర్

పారామెడికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పడిపోయినది

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అంబాజీపేట మండలం వాకలగరువు గ్రామ కాపురస్తులు కాప వీర వెంకట సత్యనారాయణ తండ్రి నాగభూషణం గారికి చెందిన ఒరిజినల్ పారామెడికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పడిపోయినది. సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ నెంబర్ **2018/70/005140** ది.**01-09-2024**వ తేదీన వాకలగరువు నుండి అంబాజీపేట జిరాక్స్ నిమిత్తం వెళ్ళుతుండగా మార్గమధ్యంలో పడిపోయింది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు అందజేయగలరు.

కాప వీర వెంకట సత్యనారాయణ
తండ్రి నాగభూషణం
H.No.1-85 వాకలగరువు , పేరూరు పోస్ట్
533218 అంబాజీపేట మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
ఫోన్ నెంబర్:9866158903